జనవరి 26 మాంసం దుకాణాలకు సెలవు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జనవరి 26 ఆదివారం భారత గణతంత్ర దినోత్సవం సంద ర్భంగా మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో గల జంతువధ, మాంస విక్రయాల నిషేధం ఉన్నందున జంతువధశాలలు, మటన్, చికెన్, చేపలు, మొదలైన మాంసాహారపు దుకాణాలకు సెలవు ప్రకటిస్తున్నట్టు హెూటళ్ళు, రెస్టారెంట్లలో ఎటువంటి మాంసాహారాలను వినియోగించరాదని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డా. ఇ.ఎన్.వి.నరేష్ కుమార్ శుక్రవారం తెలిపారు. జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ ఎమ్.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా జివిఎంసి పరిధిలో మటన్, చికెన్, చేపలు మొదలైన మాంసాహార అమ్మకాలు నిషేధించినందున శానిటరీ ఇన్స్పెక్టర్లు, శానిటరీ కార్యదర్శులు, శానిటరీ మేస్త్రీలు వారి సచివాలయం పరిధిలో గల మాంసం, చేపలు విక్రయ శాలలను మూసి వేయవలసినదిగా ఆదేశించామని తెలిపారు.

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సంపూర్ణ సహకారం

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందేలా పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ.. ఔత్సాహికులకు సంపూర్ణ సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశంలో ఆయన పలు అంశాలపై చర్చించారు. అన్ని రకాల సాంకేతిక అంశాలపై అధికారులు అవగాహన కలిగి ఉండాలని, పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి అన్ని విధాలుగా సహకారం అందించాలని సూచించారు. సమావేశంలో భాగంగా గతంలోని అజెండా అంశాలపై తీసుకున్న చర్యల గురించి జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు వివరించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు అనువైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో అధికారులు పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయాలన్నారు. జిల్లాలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గాజువాక, ఆటోనగర్ వద్ద గల రోడ్ ఓవర్ బ్రిడ్జి(ఆర్.వో.బి.), పెదగంట్యాడ, అగనంపూడి, ఆటోనగర్లలో ఫ్లాట్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, పీఎం విశ్వకర్మ యోజన పథకం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన ఆయన పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. భూ సేకరణ, సింగిల్ విండో క్లియరెన్స్ అంశాల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఈ సెక్టార్ల ఏర్పాటులో చురుగ్గా వ్యవహరించాలన్నారు. కోర్టు కేసులు, ఆక్రమణల విష యంలో అప్రమత్తంగా ఉండాలని, నిర్ణీత సమయంలో చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం ఆదిశేషు, విశాఖ ఆర్డీవో పి.శ్రీలేఖ, ఐలా ప్రతినిధులు, పారిశ్రా మికవేత్తలు, ఇతర విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విశాఖలో 27న ప్రాంతీయ పర్యాటక పెట్టుబడిదారుల సదస్సు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రీజినల్ టూరిజం ఇన్వెస్టర్స్ ఎంగేజ్మెంట్ పేరుతో ఈ నెల 27వ తేదీన విశాఖపట్టణం వేదికగా రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రాంతీయ పర్యాటక పెట్టుబడి దారుల సదస్సు జరగనున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారిణి కె.జ్ఞానవేణి శుక్రవారం తెలిపారు. స్థానిక నోవోటెల్ హెూటల్లో ఆ రోజు ఉదయం 10.00 గంటల నుంచి సదస్సు జరుగు తుందని, జాతీయ స్థాయిలోని దిగ్గజ కంపెనీల ప్రతినిధులు భాగ స్వామ్యం కానున్నారని చెప్పారు. పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించే నిమిత్తం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొ న్నారు. అడ్వెంచర్, క్రూయిజ్ టూరిజం, ఎకో టూరిజం, అరకు కాఫీ, 2024-29 న్యూ టూరిజం పాలసీపై చర్చ జరుగుతుందని, దిగ్గజ కంపెనీల ప్రతినిధులు, అధికార ప్రతినిధులు చర్చిస్తారని తెలిపారు. ఈ సదస్సులో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి, ఛైర్మన్, సీఎస్, పర్యాటక శాఖ ఎండీ, ఇతర ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు భాగస్వామ్యం అవుతారని పేర్కొన్నారు.

గీత కులాలకు 14 మద్యం దుకాణాల కేటాయింపు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గీత కులాలకు జిల్లాలో 14 దుకాణాలు కేటాయిస్తూ జిల్లా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ మీటింగు హాలులో ఎక్సైజ్ డీసీ రామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ ప్రసాద్, గీత కులాల ప్రతినిధులు, మీడియా సమక్షంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ దుకాణాల కేటాయింపునకు సంబంధించిన లాటరీ ప్రక్రియను శుక్రవారం ఉదయం నిర్వహించారు. మొత్తం 14 దుకాణాలకు గాను జీవీఎంసీ పరిధిలో 11 ఉండగా, గ్రామీణ మండలాలైన భీమిలి, ఆనందపురం, పద్మనాభం పరిధిలో మరొక మూడు దుకాణాలు ఉన్నాయి. లాటరీలో భాగంగా జీవీఎంసీ పరిధిలోని 11 దుకాణాల్లో ఒకటి గౌడ్, మరొకటి యాత కులానికి రాగా, మిగిలిన తొమ్మిది దుకాణాలు శెట్టిబలిజ కులానికి దక్కాయి. మిగిలిన మూడింటిలో గౌడ కులానికి ఆనందపురంలో అవకాశం లభించగా, భీమిలి, పద్మనాభం మండలాల్లో శెట్టిబలిజకు రెండు దుకాణాలు దక్కాయి. ఈ ప్రక్రియలో మొత్తం జీవీఎంసీ, గ్రామీణ మండ లాలైన భీమిలి, పద్మనాభంలో శెట్టిబలిజకు మొత్తం 11 దుకా ణాలు రాగా గౌడకు ఆనందపురంలో, యాత, గౌడ్ కులాలకు జీవీఎంసీలో ఒక్కొక్కటి చొప్పున దుకాణాలు దక్కాయి.

ఈ నెల 27 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ స్థానికంగా నిర్వహించిన లాటరీ ప్రక్రియ ప్రాథమిక వివరాలను డైరక్టరేట్‌కు నివేదిస్తామని, దాని ప్రకారం గెజిట్ విడుదల అవుతుందని పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదీన గెజిట్ విడుదల అయిన నుంచి ఫిబ్రవరి 05వ తేదీ సాయం త్రం 05.00 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఉంటుందని చెప్పారు. ఫిబ్రవరి 06వ తేదీన పరిశీలన ప్రక్రియ, 07వ తేదీ ఉదయం 10.00 గంటల నుంచి తుది లాటరీ ప్రక్రియ ఉంటుందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 10 శాతం దుకాణాల కేటా యింపు ప్రక్రియను నిబంధనలను అనుసరించి అత్యంత పారదర్శకంగా నిర్వహించామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

తక్షణమే పెండింగ్ జీతాలు చెల్లించాలి

గుర్తింపు యూనియన్ డిమాండ్

విశాలాంధ్ర - గాజువాక: ఉక్కు ఉద్యోగులకు తక్షణమే పెండింగ్ జీతాలను చెల్లించాలని ఏఐటీయూసీ, మిత్ర పక్షాలు యాజమాన్యాన్ని డిమాండ్ చేసాయి. ఏఐటీయూసీ, మిత్ర పక్షాల ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఉక్కు ఈడి (వర్క్స్) బిల్డింగ్ వద్ద ధర్నా నిర్వ హించారు. ఉక్కు ఉద్యోగులకు తక్షణమే పెండింగ్ జీతాలను చెల్లించాలని, విశ్రాంత ఉద్యోగులకు ఇచ్చే మెడికల్ స్కీంలో మార్పులను రద్దు చేసి పాత పద్ధతిలోనే కొనసాగించాలని, మీల్ కార్డు డబ్బులు కూడా వేయాలని నినాదాలు చేసారు. అనంతరం సీజీఎం (వర్క్స్) ఇన్చార్జి రంజన్ మహంత, హెచ్. ఆర్. జి.ఎమ్. ఎన్. భానులకు తక్షణమే పెండింగ్ జీతాలను చెల్లిం చాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం అంద జేశారు. ఈ కార్యక్రమంలో స్టీల్ ఏఐటీయూసీ అధ్యక్షులు కె.ఎస్.ఎన్.రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.మసేన్‌రావు, అదనపు ప్రధాన కార్యదర్శి జె.రామకృష్ణ, డొక్కా నర్సింగ రావు, డి.దేముడు, చీకటి శ్రీనివాస్, అట్లూరి శివ రామక్రిష్ణ, ఎస్.మోహన్ బాబు, తాండ్ర కనక రాజు, మురళీ కృష్ణ, జి.ఆనంద్, మిత్ర పక్షాల నాయకులు గణపతి రెడ్డి, దొమ్మేటి అప్పారావు, ఎం.మహాలక్ష్మి నాయుడు, పల్లా పెంటారావు, యూజ్ మణి తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 18 వినతులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కి సంబంధించి 18 వినతులు వచ్చాయని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకారరావు తెలిపారు. శుక్రవారం ఆయన జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ ఎమ్.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో సిపిలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమానికి 18 వినతులు వచ్చాయని, అందులో ముఖ్యంగా 2వ జోన్‌కు 04, 3వ జోన్‌కు 04, 4వ జోన్‌కు 01, 5వ జోన్‌కు 01, 6వ జోన్‌కు 03, 7వ జోన్‌కు 02, 8వ జోన్ కు 03 వినతులు వచ్చాయని తెలిపారు. జీవీఎంసీ పరిధిలో ప్రజలు పట్టణ ప్రణాళిక విభాగమునకు సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు మొదలైనవి ప్రతి శుక్రవారం నమోదు చేసుకోవచ్చునన్నారు. వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగు అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో జీవామృతం

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని తర్లువాడ గ్రామంలో రీజనల్ జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు పర్యవేక్షణలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో జీవామృతం కషాయాల తయారీకి శాశ్వత జీవామృతం ఫిట్ ఏర్పాటు చేశారు. అలాగే రీజనల్ అధికారి హేమ సుందర్ మాట్లాడుతూ రైతులకు ద్రవ జీవామృతం కషాయాలు వాటిని పిచికారి చేయడానికి వీలుగా రైతులకు ఉపయోగపడుతుందని రైతులందరూ పలు పంటలను సాగు చేయడం ద్వారా సంవత్సరం మొత్తానికి దిగుబడి సాధించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఏ చక్రవర్తి ,ఇంటర్నల్ మౌనిక, రూప, మోడల్ మేకర్ రామారావు తదితరులు హాజరయ్యారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

విశాలాంధ్ర - భీమిలి: భీమునిపట్నం ఎస్‌వీఎల్ఎంఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో కామర్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ కర్నూలు స్వచ్ఛంద సేవా సంస్థ వారి సహకారంతో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్థిక వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగించడం క్రెడిట్ స్కోరు కొత్త తరహా బ్యాంకులు బిజినెస్ కరస్పాండెంట్లు యూపీఐను క్రియాత్మకం చేయటం ఆన్లైన్, మొబైల్ బ్యాంకింగ్ లావాదేవీలు, ఏటీఎం లావాదేవీలు మోస పూరిత డిజిటల్ లావాదేవీలలో తీసుకోవలసిన జాగ్రత్తలు ఫైనాన్షియల్ ఇన్ఫర్మేషన్ ప్రొవై డర్లు తదితరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ కామర్స్ డాక్టర్ సిహెచ్ విష్ణుమూర్తి, కామర్స్ అధ్యాపకులు డాక్టర్ బి.సహదేవుడు, వై.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

బడుగుల జీవనోపాధిని దెబ్బతీసే చర్యలు మానుకోవాలి

జీవీఎంసీ అధికారులు, పోలీసులు తీరుపై ఏఐటీయూసీ ఆందోళన

విశాలాంధ్ర - పెందుర్తి: జీవనోపాధి కోసం చిరు వ్యాపారాలు చేసుకుంటున్న బడుగులపై జీవీఎంసీ అధికారులు, పోలీసులు అమాను షంగా దాడి చేయడాన్ని నిరసిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తోపుడు బండ్ల వర్తకులు, ఫుట్పాత్ వ్యాపారస్తులు వేపగుంట జోనల్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీ యూసీ నాయకులు ఆర్. శ్రీనివాసరావు, శ్రీ ముత్యమాంబ తోపుడు బండ్ల వ్యాపారుల సంఘం గౌరవ అధ్యక్షులు వై.రాంబాబు మాట్లాడుతూ చిరు వ్యాపారస్తుల పట్ల జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు దురుసు ప్రవర్తనతో వ్యవహరించటం తగదన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం చిరు వ్యాపార స్తులకు హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలని 2013లోనే చట్టం తీసుకువచ్చి 2014లో పార్లమెంట్‌లో గెజిట్ నోటిఫికేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశించినా పట్టికోకుండా జాప్యం చేశారని వాపోయారు. వారి వల్ల ప్రజలకు ఇబ్బందులకు గురైతే ఆయా కార్మిక సంఘం ద్వారా చర్చలు జరపాలి తప్పా వారి ఆస్తులను నాశనం చేయటం అధికార దుర్వినియోగమే అని అన్నారు. రోడ్డుపై జీవించే వారిపై సానుకూలంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. లేని యెడల ప్రజా ఉద్యమంగా మలుచుతామని స్పష్టం చేశారు. అనంతరం జోనల్ కార్యాలయంలో సూపరిం టెండెంట్ శ్రీనివాస శర్మకి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయ కులు ఎన్.ఆశీరి నాయుడు, వ్యాపారస్తులు శ్రీను, గౌరీ, సత్య నారాయణ, వసంతరావు పాల్గొన్నారు.

నేటి నుండి చాగంటి ప్రవచనాలు

విశాలాంధ్ర - మధురవాడ: మానవ విలువలకు నైతికతకు నిలువెత్తు నిదర్శనమైన వాల్మీకి విరుచిత శ్రీ సీతారాముల వైవిధ్య భరిత గాథను ప్రవచనా చక్రవర్తి చాగంటి కోటేశ్వరరావు 42 రోజులపాటు తన ప్రవచనా అమృత ధారలతో భక్తులను ఆదరించనున్నారని గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి పులగుర్త సోమరాజు తెలిపారు. శుక్రవారం గాయత్రి విద్యా పరిషత్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చాగంటి కోటేశ్వరరావు తన 25 ఏళ్ల ప్రవచన జీవనములో ఇప్పటివరకు రెండుసార్లు మాత్రమే దీర్ఘకాలం ఒకే వేదికపై ప్రవచనాలు చెప్పారని, నేడు మూడోసారి ఆయన వాల్మీకి విరచిత సంపూర్ణ రామాయణాన్ని 42 రోజులు ప్రవచించనున్నారని తెలిపారు. ఈ సదవకాశాన్ని విశాఖలోని అన్ని ప్రాంతాల ప్రజలు వినియోగించుకునేలా ప్రాంతాల నుండి రవాణా ఏర్పాటు చేస్తున్నామని, సాయంత్రం 6 గంటల నుండి ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ప్రస్తుతం యువత నైతికతకు దూరంగా పలు ఒత్తిళ్లకు లోనవుతుందని శ్రీ రామ చరిత్ర యువతను ఒత్తిళ్ళ నుంచి రక్షించి వ్యక్తికి వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో ఉపయోగపడుతుందని అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఆయనతోపాటు చాగంటి చరణ్, అన్నం రాజ్ సత్యనారాయణ, రాజ్ కుమార్ గోస్వామి సాయంత్రం 6 గంటలకు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - మల్కాపురం: పివిఎస్ హెల్పింగ్ హాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జనవరి 26న నిర్వహించబోయే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఆ సంస్థ వ్యవస్థాపకులు, 60వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ పివి సురేష్ కోరారు. పారిశ్రామిక ప్రాంతం యువత రక్తదానం ద్వారా పలువురికి ప్రాణదానం చేయవచ్చని పేర్కొన్నారు. ప్రతి గణతంత్ర దినోత్సవ రోజున ఈ మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఉక్కు అధికారి మార్టిన్ టోప్పో సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్‌లో సాధారణ కార్మికుడిగా జాయిన్ అయి 37 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసి అంచెలంచెలుగా తన సేవలతో ఎదిగి డిప్యూటీ మేనేజర్‌గా ఈ నెల 31న ఉద్యోగ విరమణ పొందుతున్న మార్టిన్ టోప్పో ఆదర్శనీయులని ఇనుస్ట్రుమెంటేషన్ కోకోవెన్ జోన్ కార్మికులు కొనియాడారు. 1987 సంవత్సరంలో ఝార్ఖండ్ రాష్ట్రంలో మారుమూల పల్లె నుండి విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు ఉద్యోగంలో మార్టిన్ టోప్పో ఈ 37 సంవత్సరాలు పని విధానంలో చూపించిన శ్రద్ధ అందరికి ఆదర్శం కావాలని జోనల్ ఇన్‌చార్జి నాగ ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో విభాగం ఉద్యోగులు చెబోలు కనకరాజు, అన్నపరాజు, కిరణ్కుమార్, దుర్గారావు, కార్మిక సంఘాల నాయకులు యేల్లేటి శ్రీనివాసరావు, చీకటి శ్రీనివాస్, కోగంటి లెనిన్ బాబు, రామచంద్ర రావు, ఎస్ అప్పలరాజు, ఉప్పిలి రామకృష్ణ, నరసింహ రాజు, ధనరాజు, సతీష్ కుమార్, సుబ్బారావు, రమణ రావు, రవికుమార్, కెవిఎ బాబ్జి, పవన్ కుమార్, రవికుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్గీయ నాగోతి సింగన్నకు ఘన నివాళులు

విశాలాంధ్ర - పీఎం పాలెం: పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్య ప్రకాష్ తండ్రి, మధురవాడ ప్రాంత ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు స్వర్గీయ కామ్రేడ్ నాగోతి సింగన్న 8 వ వర్ధంతి కార్యక్రమం వారి స్వగృహంలో వారి కుటుంబ సభ్యులు, పౌర సంక్షేమ సంఘం సభ్యులు సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పౌర సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు యల్ యస్ నాయుడు. జగన్మోహన్ చౌదరి, బెల్లపు పాపారావు, యస్ వి రమణ, పోలిశెట్టి నాగేశ్వరరావు, డా యస్ రమేష్, డా బి యస్ రావు, టి మోహన్ రావు, బయపల్లి సతీష్ కుమార్, వై శంకర్రావు, తోట ఆషా స్వరూప్, మామిడి వరలక్ష్మి, యన్ బాబ్జీ, తిలక్ పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో ఏడుగురికి పదోన్నతి

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖలో మొట్టమొదటి సారిగా సిబ్బంది సంక్షేమానికి మొదటి ప్రాధాన్యం ఇస్తూ నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రాత బాగ్చి, విశాఖ కమిషనరేట్ నందు కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతూ పదోన్నతి పొందిన సిబ్బందిని సత్కరించి, పదోన్నతి ర్యాంకులతో పాటుగా పోస్టింగ్ ఆర్డర్ అందజేయు కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం విధితమే. శుక్రవారం నగర పోలీసు కమిషనరేట్ కు చెందిన ఏడుగురు సిబ్బందికి పదోన్నతులు అందించడం జరిగినది, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్ళు, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్లుగా, ఒక జూనియర్ అసిస్టెంట్ సీనియర్ అసిస్టెంట్‌గా, ముగ్గురు కానిస్టేబుళ్ళు హెడ్ కానిస్టేబుళ్ళుగా, ఒక మహిళా కానిస్టేబుల్, మహిళా హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందడం జరిగింది. సిబ్బంది సంక్షేమం కోసం ప్రత్యేక ప్రాధాన్యం ఎల్లప్పుడూ ఇచ్చే సిపి పోలీసు శాఖ నందు పదోన్నతి పొందిన సదరు సిబ్బందిని వారి కుటుంబ సభ్యులతో పాటుగా నగర పోలీసు సమావేశమందిరం (టెంపుల్ ఆఫ్ లెర్నింగ్) కు ఆహ్వానించి నూతన పదోన్నతికి సంబంధించిన ర్యాంకులను, పోస్టింగ్ ఆర్డర్లను స్వయముగా అందజేశారు.

కోడి కత్తి కేసుకు హాజరు కాని జగన్

కోర్టు ధిక్కారంగా పరిగణించాలని విదసం డిమాండ్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సంచలన కోడి కత్తి కేసు విచారణ మళ్ళీ వాయిదా పడింది. ఎన్ఐఏ కోర్టులో కోడి కత్తి కేసు శుక్రవారం విచారణకు రాగా బెయిల్ మీద ఉన్న ముద్దాయి జనపల్లి శ్రీనివాస్ తన న్యాయవాది అబ్దుల్ సలీంతో కలిసి కోర్టుకు హాజరయ్యాడు. ఫిర్యాదుదారు మాజీ ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి కోర్టుకు హాజరు కాకపోవడంతో కేసు వచ్చే నెల 21కి వాయిదా వేసినట్లు న్యాయవాది సలీం తెలిపారు. కోడికత్తి కేసులో నిదితుడు శ్రీనివాస్‌కు బెయిల్ మంజూరై సంవత్సరం కావస్తుందని, గత మూడేళ్లుగా సాక్ష్యం చెప్పడానికి జగన్ మోహన్ రెడ్డి రాక పోవడం వల్ల కేసు ముందుకు కదలడం లేదని విదసం కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు ఆరోపించారు. ఇలా వందల సార్లు కోర్టు వాయిదాకు గైర్హాజరయ్యే వారిని కోర్టు ధిక్కారంగా పరిగణించాలని డిమాండ్ చేశారు.

కెడిపిఎమ్ పాఠశాలలో బాలికా దినోత్సవం

విశాలాంధ్ర - మధురవాడ: బాలికా దినో త్సవం సందర్భంగా గీతం ఆసుపత్రి సామాజిక వైద్య విభాగం, గీతం మహిళా సాధికారిక విభాగం, రోటరీ క్లబ్ పెరలిసిటి ఆధ్వర్యంలో స్థానిక పెదవాల్తేరులోని కె.డి.పి. ఎమ్. ఉన్నత పాఠశాల మరియు వన్‌టౌన్‌లోని క్వీన్ మేరీ ఉన్నత పాఠశాలలలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించారు. గీతం ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఛైర్‌పర్సన్ డాక్టర్ వి.బి.శ్రీ విద్య హాజరై బాలికలకు ఆరోగ్య ప్రాధాన్యతను, పోషకాహార ప్రాధాన్యతను తెలియజేశారు. మానసికంగా, శారీరకంగా ఆరోగ్యవంతంగా ఉండటం ద్వారా పోటీ ప్రపం చంలో ఎదగడా నికి అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. బాలికలు రక్తహీనత వంటి సమస్యలు తలెత్త కుండా జాగ్రత్త వహించాలని సూచించారు. కౌమార దశలో బాలికలు ఎదుర్కొనే శారీరక సమస్యలకు సంబంధించిన సందేహాలను ఆమె నివృత్తి చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలలోని బాలికలకు వైద్య పరీక్షలను నిర్వహించి తగిన మందులను అందజేశారు. కార్యక్రమంలో కె.డి.పి.ఎమ్.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమతి బాయి, గీతం పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి డాక్టర్ ఎమ్.వి.వి.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రికార్డుల తనిఖీ

విశాలాంధ్ర - భీమిలి: భీమునిపట్నం పిఎస్ఎమ్ హైస్కూల్‌లో ఎండిఎం జిల్లా కోఆర్డినేటర్ జే.శాస్త్రి సందర్శించారు. స్కూల్ నందు అమలు జరుగుతున్న ఎండిఎంకు సంబంధించి రికార్డులన్నీ తనిఖీ చేశారు. పిల్లలందరూ నూరు శాతము స్కూల్ నందు భోజనం తినేటట్లు ప్రోత్సహించాలని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుని ఎం.తిరుమల శ్రీదేవిని ఆదేశించారు. మధ్యాహ్న భోజన సమయంలో పిల్లలతో భోజనాన్ని రుచి చూశారు. స్కూల్ నందు ఎండిఎం నిర్వహణ పద్ధతి పరిశీలించి సంతృప్తి చెందారు.

కృష్ణాపురంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం కృష్ణాపురం గ్రామంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈనెల 20వ తారీకు నుండి 31వ తారీకు వరకు పలు గ్రామాల్లో ఈ యొక్క శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని రైతులు అందరూ తమ పశువులకు ఎటువంటి అనారోగ్య సమస్యలువున్న ఉచితంగా వైద్యం అందిస్తామని పద్మనాభం వెటర్నరీ డాక్టర్ మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులందరూ పాల్గొని తమ పశువులను చికిత్సలు నిమిత్తం తీసుకు రావడం జరిగింది.వెటర్నరీ సిబ్బంది గర్భకోస వ్యాధులకు పశు వ్యాధి నిర్ధారణ సమస్యలు వ్యాధి నిరోధక టీకాలు సుమారు 60 పశువులకు తనిఖీలు చేసి చికిత్సలు అందించారు. ఈ కార్యక్రమంలో మొకర అప్పలనాయుడు (అన్నమయ్య) ఎక్స్ ఎంపీటీసీ బొడ్డు శ్రీను, రైతులు,వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కు దీక్షలను సందర్శించిన బోగవిల్లి

విశాలాంధ్ర - మల్కాపురం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో 1398వ రోజు రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో జిల్లా ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి బోగవిల్లి నాగభూషణం పాల్గొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమకు ప్యాకేజీ ప్రకటించడం ఒక బూటకమని, కార్మికులను ప్రజలను, తప్పుదోవ పట్టించడానికి ఈ ప్రకటన చేశారని ఆరోపించారు. కార్మికులకు విఆర్ఎస్ ప్రకటించడం, పనిచేస్తున్న కార్మికులకు మూడు నెలల నుండి జీతాలు ఇవ్వకపోవడం, పనిచేస్తున్న 4,000 మంది కాంట్రాక్ట్ కార్మికులను తగ్గించడం, ఇవన్నీ ప్రైవేటీకరణ చేయడంలో భాగమేనన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించే వరకు ఈ పోరాటం కొనసాగుతుందన్నారు.

సివిల్ సప్లై గొడౌన్ల హమాలీల నిరసన

విశాలాంధ్ర - విశాఖ: రాష్ట్రవ్యాప్తంగా సివిల్ సప్లై గోడౌన్స్ బంద్‌లో భాగంగా మర్రిపాలెం సివిల్ సప్లై గోడౌన్ వద్ద హమాలీలు శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై హమాలీస్ యూనియన్ (ఏఐటియుసి) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మన్మధరావు మాట్లాడుతూ 2024 జనవరి నుండి పెంచవలసిన కూలి రేట్లు సంవత్సర కాలం గడిచిన ఇంకా పెంచకుండా కాలయాపన చేయడం దారుణమని, రాష్ట్ర ప్రభుత్వ%శీ% వెంటనే జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో 26 జిల్లాల్లో రానున్న కాలంలో నిరవధికంగా పనులు అవుతామని తెలియజేశారు. రెక్కలు ముక్కలు చేసుకుని కాయకష్టం చేస్తున్న హమాలీల పట్ల ప్రభుత్వం సవతి తల్లి ప్రేమతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పేద ప్రజలకు ఆహార ధాన్యాలు పంపిణీ చేయడంలో హమాలీలు చాలా కష్టపడుతున్నారని అన్నారు. సమస్యలను పరిష్కరించకపోవడం వల్ల అనేక కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం చనిపోయిన హమాలీల కుటుంబాలకు పీఎఫ్ ద్వారా పెన్షన్స్ సౌకర్యాన్ని అమలు చేయకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 దసరా సందర్భంగా ఇవ్వాల్సిన యూనిఫామ్, చనిపోయిన హమాలీ కుటుంబాలకు పెన్షన్ అమలు చేయాలని, 60 సంవత్సరాలు నిండి రిటైరైన హమాలీలకు పెన్షన్ వర్తింపజేయాలని, పెండింగులో ఉన్న ఈఎస్ఐ సౌకర్యాన్ని ప్రవేశపెట్టాలని, హమాలీలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేస్త్రి గంది వెంకటరమణ, కొల్లి సన్యాసినాయుడు, ఎం జోగి నాయుడు, కొల్లి రమణ ఎం. వెంకటరమణ మేస్త్రి తదితరులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సమస్యలు

హోంమంత్రి వంగలపూడి అనిత

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో 2025-డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డైరీని, కేలండర్‌ను ఆవిష్కరించిన అనంతరం అనిత మాట్లాడుతూ ఐక్యతగా ఉద్యోగులు పనిచేస్తే, సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయన్నారు. అంబేద్కర్ భావజాలం ఇంకా ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్ళాలని, ఎప్పుడు మనల్ని మనం తగ్గించుకోకూడదని, అందరిలాగే చదువుకున్నాం...అందరిలాగే ఉద్యోగాలు చేస్తున్నామని...అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు వెళ్ళాలని పిలుపునిచ్చారు. దేశ ప్రజలు అందరి కోసం అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారని, నీతి,నిజాయితీగా అధికారులు పని చేయాలని, తాను ఒక టీచర్ గా 2013 లో చంద్రబాబు దగ్గరికి వెళ్ళానని ఆయన నన్ను ఏం చదువుకున్నావని మాత్రమే అడిగారని అప్పటి నుంచీ ఆయన నాకు అన్ని విధాలుగా చేయూత ఇస్తున్నారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ఎస్సీఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. సునీల్ కుమార్ మాట్లాడుతూ మా ఉనికి కాపాడుకోవడానికి మా సమస్యలు చెప్పడానికి ఇలాంటి కార్యక్రమాలు వేదికగా నిలుస్తున్నాయన్నారు. తమను కాస్ట్ బేస్ అసోసియేషన్‌గా చూడొద్దు అని... రాజ్యాంగ బద్ధమైన సంఘంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. విశాఖ జెడ్పీ డిప్యూటీ సీఈఓ కే రాజ్ కుమార్ మాట్లాడుతూ మన హక్కుల కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, రాబోయే కాలంలో పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని సభా ముఖంగా ప్రకటిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు యజ్జల విజయ్‌కుమార్, కార్యదర్శి మల్లిపూడి సత్యన్నారాయణ, కోశాధికారి ఆనంద్, అసోసియేట్ అధ్యక్షులు హెచ్‌డీ ఈరన్న, డైరీ కమిటీ ఛైర్మన్ బి. రత్న ప్రసాద్, అదనపు ఎస్పీ స్వరూపా రాణి, డీఎఫ్ఓ కృపావరం, తదితరులు పాల్గొన్నారు.

యువ నేత నారా లోకేష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్ర రాష్ట్ర మానవ వనరుల, ఐటీ, విద్యాశాఖా మంత్రి, యువ నేత నారా లోకేష్ బాబు 42వ జన్మదిన వేడుకలు విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో 75వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన 75వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి ముందుగా కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమం రాష్ట్ర అభివృద్దే ధ్యేయంగా పని చేస్తున్న మన యువ నేత నిండు ఆరోగ్యముతో భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కిలాన ముసలయ్య, ములకలపల్లి పెంటయ్య, నంబారు సింహాద్రి, దొమ్మేటి పెరుమాళ్,, టేకేటి అప్పారావు, వరలక్ష్మి, లక్ష్మి, ఊరుకుటి వెంకటరావు, కడవల రమణ, మొల్లి రమణ, మొల్లి అప్పల నాయుడు, మొల్లి సన్నీ, మొల్లి అక్తర్, దొమ్మేటి అప్పారావు, బస అప్పల రెడ్డి, సీతారామ్ ఎల్లంకి రమణ, పులి శ్రీరామ రెడ్డి,మొల్లి అప్పారావు, రాజు, పెరుమాళ్, నాగ రాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రాన్ని వినియోగించుకోండి

విశాలాంధ్ర - ఆనందపురం: విశాఖపట్నం సిటీ పోలీస్ కమీషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా రోడ్డు ప్రమాద బాధితులకు పరిహారం అందేవరకు కావలసిన సహాయం అందజేయడం జరుగుతుందని ఆనందపురం ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ పి. పాపారావు తెలిపారు. ఈ సహాయక కేంద్రం తీసుకున్న చర్యల ఫలితంగా ఈ సెంటర్ ప్రారంభం నుండి ఇప్పటివరకు హిట్ రన్ రోడ్డు ప్రమాదాల్లో తీవ్ర గాయాల పాలైన 10 మంది బాధితులకు ఒక్కొక్కరికి రూ.50,000/- (అక్షరాల యాభై వేల రూపాయలు) చొప్పున మొత్తం రూ. 5,00,000/- (అక్షరాల ఐదు లక్షల రూపాయలు) వారి బ్యాంక్ ఖాతాల్లో కేంద్ర ప్రభుత్వ నిధి నుండి జమ చేయించడం జరిగిందని తెలిపారు. రోడ్డు ప్రమాదాల బాధితులు (చనిపొయిన వ్యక్తి కుటుంబ సభ్యులు లేదా తీవ్ర గాయల పాలైన ఫ్ ఇన్ అన్ వారు) తక్షణమే రోడ్డు ప్రమాద బాధితుల ప్రమాద సహాయక కేంద్రం ఫోన్ నంబర్ 7995095793కు ఫోన్ చేసి మీకు కావలసిన అన్ని విధాల సహాయం పొందాలన్నారు.

ఆదర్శలో ఘనంగా బాలికల దినోత్సవం



విశాలాంధ్ర - పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఎన్ ఈ ఫ్లోరా తెలియజేశారు. ఈ సదస్సులో రెండవ సంవత్సరం విద్యార్థులు నిఖిల, బ్లెస్సి, ఏనిజాయ్, మాధవి, శ్యామల, కుష్మిత, ఐశ్వర్య. మొదటి సంవత్సరం విద్యార్థులు గిరీష, రోజ్లిన్, అంజనశ్రీ, శాంతి ప్రియ, ప్రజెంటేషన్ లో గర్ల్ చైల్డ్ యొక్క ప్రాముఖ్యత, ప్రస్తుతం వ్యవస్థలో వారి యొక్క పాత్రను క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా ప్రిన్సిపాల్ ఎన్.ఈ ఫ్లోరా పాల్గొనగా, ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్లు మంజుల, సంధ్యారాణి, రమ్య, శైలజ కుమారి, కామేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్, సెక్రెటరీ టి.థియోఫిలస్ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు మంజుల, సంధ్యారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం మిస్సింగ్ కేసు నమోదు అయింది. వివరాల్లోకెళ్తే వెల్లంకి గ్రామానికి చెందిన ముక్కమల్ల రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు తన భర్త రాజశేఖర్ రెడ్డి (34)సంవత్సరాలు రెడ్డి కులం, ప్లాస్టిక్ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు వ్యాపారంలో భాగంగా ఆర్థిక ఇబ్బందుల్లో అప్పులు చేసినట్లు తెలుస్తుంది. ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం 9 గంటలకు షాప్ కి వెళ్తున్నానని తన భార్యకు చెప్పి వెళ్లాడు, భార్య రాజ్యలక్ష్మి అనుమానంతో షాపుకు వెళ్లి చూడగా భర్త లేడని తెలిసి బంధువులకు సమాచారం అందించడంతో చుట్టుపక్కల వెతకగా ఆచూకీ దొరకకపోవడంతో అనందపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ కేసును సిఐ చింతా. వాసునాయుడు ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ వీకే ప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు.

భేటీ పడావో భేటీ బచావో అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర -పెందుర్తి : బేటి పడావో ... బేటి బచావో అనే కార్యక్రమంలో భాగంగా పెందుర్తి అంగనవాడి ప్రాజెక్టు పరిధి నల్ల క్వారీ 1, 2, మహాలక్ష్మి నగర్ కాలనీలలో ఉన్న అంగన్వాడి కేంద్రాలలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 11 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలు వయసు గల ఆడపిల్లలకు ఏ విధంగా భద్రత కల్పించాలి .... బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు ఎం వరలక్ష్మి, ఏ సుజనా, స్కూల్ టీచర్లు లక్ష్మి, అనూష తదితరులు పాల్గొన్నారు.

అల్టిమేట్ కేర్‌ను ఆవిష్కరించిన కేర్ హెల్త్

విశాలాంధ్ర-విశాఖపట్నం: భారతదేశంలోని ప్రముఖ ఆరోగ్య బీమా సంస్థలలో ఒకటైన కేర్ హెల్త్ ఇన్సూరెన్స్, ఆరోగ్య కవరేజీలో కొత్త ప్రమాణాలను నిర్దేశించడానికి రూపొందించబడిన ఒక అద్భుతమైన ఆరోగ్య బీమా పాలసీ అల్టిమేట్ కేర్‌ను తీసుకువచ్చినట్లు ప్రకటించింది. ఊహించని వైద్య అత్యవసర పరిస్థితుల సమస్యను పరిష్కరించడానికి రూపొందించబడిన విస్తృత ప్రయోజనాలను అల్టిమేట్ కేర్ మిళితం చేస్తుంది మరియు ఆరోగ్యంగా ఉన్నందుకు మీకు బహుమతులు ఇస్తుంది. అల్టిమేట్ కేర్ మనీబ్యాక్ ఫీచర్‌తో సహా విస్తృతమైన ఆరోగ్య కవరేజీని అందిస్తుంది, ఇక్కడ పాలసీదారులు ఆరోగ్యంగా ఉండటానికి రివార్డ్ పొందుతారు. ప్రతి 5 క్లెయిమ్ ఫ్రీ సంవత్సరాల తర్వాత కంపెనీ మొదటి సంవత్సరం బేస్ ప్రీమియంను తిరిగి చెల్లిస్తుంది. దీని లాయల్టీ బూస్ట్ 7 క్లెయిమ్ ఫ్రీ సంవత్సరాల తర్వాత మొదటి పాలసీ సంవత్సరం ఇన్సూర్ చేసిన మొత్తం కి సమానమైన అదనపు బీమా మొత్తాన్ని అందిస్తుంది.

ఒప్పో రెనో 13 సిరీస్ విడుదల

విశాలాంధ్ర- విశాఖపట్నం : ఎంతో ఆసక్తి గా ఎదురుచూస్తున్న రెనో 13 సిరీస్ 5 జీ ని ఒప్పో ఇండియా అధికారికంగా విడుదల చేసింది. స్మార్ట్‌ఫోన్ అనుభవాన్ని పునర్నిర్వచించేలా దీన్ని తయారు చేశారు. దీనిలోని మీడియా టెక్ డిమెన్సిటీ 8350 ఎస్ఓసి తో శక్తినిచ్చే ఫ్లాగ్‌షిప్-స్థాయి కెమెరా సిస్టమ్‌ను కలిగి ఉంది. ఇమిజంగ్, ప్రొడక్టివిటీ రెండింటినీ అందించేలా అత్యాధునిక ఏ ఐ ఫీచర్లు కలిగిన, రెనో 13 సిరీస్ అసాధారణమైన పనితీరును అందించేలా తయారు చేశారు. తన అల్ట్రా-డ్యూరబుల్ డిజైన్‌తో, ఈ సిరీస్ - రెనో 13 మరియు రెనో 13 ప్రోతో సహా నీరు ధూళి నిరోధకత కోసం ఐపి66, ఐ పి68 మరియు ఐపి69 సర్టిఫికేషన్లను కూడా కలిగి ఉంది. ఇది శైలి మరియు మన్నిక రెండింటినీ విలువైన వారికి సరైన పరికరంగా ఉంటుంది. అదనంగా, రేణు 13 సిరీస్ 80 డబ్ల్యు సూపర్‌ఉక్ ఫాస్ట్-ఛార్జింగ్‌ను అందిస్తుంది. ఇది విస్తరించిన వినియోగానికి కోసం సరైన శక్తిని నిర్ధారిస్తుంది. స్మార్ట్‌ఫోన్‌లు ఇప్పుడు మెయిన్‌లైన్ రిటైల్ అవుట్‌లెట్‌లు, ఒప్పో ఇ-స్టోర్ మరియు ఫ్లిప్ కార్ట్ ద్వారా కొనుగోలుకు అందుబాటులో ఉన్నాయి. ధరలు రూ. 37,999 నుంచి ప్రారంభమవుతాయి.

స్కై ఫోర్స్ సినిమాలో వీర్ పహరియా నటుడిగా తొలి ప్రదర్శన

విశాలాంధ్ర - విశాఖపట్నం : అక్షయ్ కుమార్, వీర్ పహరియా ప్రధాన పాత్రల్లో నటించిన 'స్కై ఫోర్స్' థియేటర్లలో విడుదలైంది. బాలీవుడ్‌లో కొత్త గణతంత్ర దినోత్సవం సందర్భంగా విడుదలైన ఈ చిత్రం, వీర్ పహరియా నటుడిగా తొలి ప్రదర్శన. ఈ చిత్రంలో నటుడు టి విజయ అకా టాడీ పాత్రలో కనిపిస్తాడు, ఈ పాత్ర స్క్వాడ్రన్ లీడర్ అజ్జమడ బొప్పయ్య దేవయ్య నుండి ప్రేరణ పొందింది. మహా వీర చక్ర గ్రహీత అయిన దేవయ్య 1965 ఇండో-పాక్ యుద్ధంలో శత్రు జెట్‌లపై తన శౌర్యం మరియు ఐకానిక్ డాగ్‌ఫైట్‌కు ప్రసిద్ధి చెందాడు. టాడీగా వీర్ పహరియా లెజెండ్ జీవితాన్ని తెరపై అప్రయత్నంగా చిత్రీకరించినందుకు అపారమైన ప్రశంసలు అందుకుంటున్నాడు.వీర్ పహరియా తొలి ప్రదర్శనను ఒక విమర్శకుడు "పేలుడు" అని పిలిచినప్పటికీ, పహరియా తొలి ప్రదర్శన "కహెూ నా... ప్యార్ హైలో హృతిక్ రోషన్ నటన అంత సంచలనాత్మకం" అని ఒక సోషల్ మీడియా వినియోగదారుడు వ్యక్తం చేశారు. ఇటీవల, పహరియా తనకు స్కై ఫోర్స్ ఒక కెరీర్ ప్రారంభం కంటే ఎక్కువ అని మాట్లాడాడు.

సెబీ వద్ద డీఆర్‌హెచ్‌పీ దాఖలు చేసిన కెంట్ ఆర్వో సిస్టమ్స్

విశాలాంధ్ర - విశాఖపట్నం: కెంట్ ఆర్వో సిస్టమ్స్ లిమిటెడ్ తన డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డి ఆర్ హెచ్ పి) మార్కెట్ రెగ్యులేటర్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి)తో ఫైల్ చేసింది. ప్రారంభ పబ్లిక్ ఆఫర్ ద్వారా ఈక్విటీ షేర్ క్యాపిటల్ ఆఫర్ ద్వారా నిధులను సేకరించాలని కంపెనీ యోచిస్తోంది. మొత్తం ఆఫర్ సైజులో 'ఆఫర్ ఫర్ సేల్' 10,094,568 ఈక్విటీ షేర్‌లను కలిగి ఉంటుంది, ఇందులో ప్రమోటర్ సెల్లింగ్ షేర్‌హోల్డర్‌ల ద్వారా ఒక్కో షేరు రూ.1 ముఖ విలువ ఉంటుంది. బ్రాండ్ 'కెంట్' బాగా స్థిరపడింది భారతదేశంలో వాటర్ ప్యూరిఫైయర్ ఉత్పత్తి విభాగంలో రివర్స్ ఆస్మాసిస్ (ఆర్వో) సాంకేతికతను పరిచయం చేయడంలో అగ్రగామిగా గుర్తించబడింది. సంవత్సరాలుగా, కంపెనీ తన ఉత్పత్తి పరిధిని వాటర్ ప్యూరిఫైయర్ ఉత్పత్తి విభాగంలో విస్తరించింది, సెప్టెంబర్ 30, 2024 నాటికి 5.50 మిలియన్ల మంది వినియోగదారులకు సేవలు అందించింది. మోటిలాల్ ఓస్వాల్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్ లిమిటెడ్, జెఎమ్ ఫైనాన్షియల్ లిమిటెడ్ ఈ సమస్యకు రన్నింగ్ లీడ్ మేనేజర్స్‌గా వ్యవహరిస్తున్నాయి.

బాలికలు శక్తివంతంగా ఎదిగేందుకు సహకారం అందించాలి

పీసీసీ ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు

విశాలాంధ్ర - పెందుర్తి: సమాజంలో బాలికలు శక్తివంతంగా ఎదిగేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన సహకారం అందించాలని పిసిసి ప్రధాన కార్యదర్శి, ఓ బి సి డిపార్ట్మెంట్ ఇంచార్జ్ మూల వెంకటరావు అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బాలికలకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ సమానమైన సమాజాన్ని నిర్మించడానికి కృషి చేస్తున్నప్పుడు, బాలికలు వారి కలలను నెరవేర్చుకోవడానికి, వారి లక్ష్యాలను సాధించడానికి సాధ్యమైన ప్రతి సహాయాన్ని అందించడం చాలా కీలకం అని పేర్కొన్నారు. విద్యలో బాలికలకు సమాన అవకాశాలను ప్రోత్సహించడానికి జాతీయ బాలికా శిశు దినోత్సవాన్ని రిమైండర్‌గా జరుపుకుంటారని, పోషణ, శ్రేయస్సు, యువతుల పట్ల గౌరవంగా ప్రవర్తించడం, అన్యాయానికి వ్యతిరేకంగా వారి గళాన్ని వినిపించేందుకు వారిని శక్తివంతం చేయడం చాలా అవసరం అని మూల వెంకటరావు స్పష్టం చేశారు.



బయోమెడికల్ రంగంపై ఇంజనీరింగ్ విద్యార్థుల దృష్టి

విశాలాంధ్ర - మధురవాడ: దేశంలోని వైద్య ఆరోగ్య రంగానికి అవసరమైన బయోమెడికల్ ఉత్పత్తుల రంగంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని ముఖ్యంగా మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు సరికొత్త ఆలోచనలతో ఈ రంగంలో అవకాశాలను అందుకోవాలని ఐఐటి మద్రాసు బయోమెడికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ బి.ఎస్.వి.ప్రసాద్ పట్నాయక్ పేర్కొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన బయోమెడికల్ ఇంజనీరింగ్ -భారత్‌లో అవకాశాలు సదస్సులో ఆయన ప్రసంగించారు. వైద్య రంగానికి అవసరమైన పరికరాలను దేశీయంగా ఉత్పత్తి చేయకపోవడంతో చాలా కాలం విదేశాల నుంచి అధిక వ్యయంతో దిగుమతి చేసుకోవలసి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. హృద్రోగులకు ఉపయోగించే కృత్రిమ కవాటాలు ఇతర బయోమెడికల్ ఉత్పత్తులను అధిక వ్యయంతో కొనుగోలు చేయడాన్ని నివారించడానికి మెడ్‌టెక్ జోన్ ద్వారా దేశీయంగా పరిశోధన, అభివృద్ధిపై దృష్టి సారించామన్నారు. దేశీయ బయోమెడికల్ ఉత్పత్తుల ద్వారా భవిష్యత్తులో వైద్య ఆరోగ్యరంగంలో అనవసర వ్యయం తగ్గడంతో పాటు రోగుల పై ఆర్థిక భారం నివారించవచ్చునన్నారు. మద్రాసు ఐఐటీలోని తమ పరిశోధన బృందం హృద్రోగులకు అవసరం అయిన బయోమెడికల్ ఉత్పత్తులపై పరిశోధనలు జరుపుతోందని ఆయన వివరంచారు. క్లీనికల్ రంగంలోని వారితో కలిసి పనిచేయడం ద్వారా వైద్య రంగానికి అవసరమైన బయోమెడికల్ ఉత్పత్తులు దేశీయంగా తక్కువ ఖర్చుతో అందించవచ్చునన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు నూతన అవకాశాల కోసం ఈ రంగంపై దృష్టి సారించాలని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజి డైరక్టర్ కె.నాగేంద్రప్రసాద్ హజరై ప్రసంగిస్తూ బయోమెడికల్ ఇంజనీరిం గ్‌కు పెరుగుతున్న ప్రాధాన్యత దృష్ట్యా గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజి, ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ సహకారంతో బిటెక్‌లో బయోమెడికల్ ఇంజనీరింగ్ కోర్సును గత ఏడాది ప్రారంభించిందని తెలిపారు. మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు బయోమెడికల్ ఉత్పత్తుల తయారీ పరిశోధనలపై అధ్యయనం చేయాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అసోసియేట్ డీన్ డాక్టర్ కామేశ్వరరావు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ ఆర్.రాజేశ్వర రెడ్డి, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మిపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

విదేశీ పెట్టుబడులకు అంబాసిడర్ చంద్రబాబు: గంటా నూకరాజు

విశాలాంధ్ర - భీమిలి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు విదేశీ పెట్టుబడులను రాష్ట్రానికి ఏవిధంగా తీసుకు వచ్చారో, ఎన్ని కంపెనీలు, పరిశ్రమలు వచ్చాయో రాష్ట్రంలో ఉండే ప్రతీ పౌరుడికి తెలుసని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటి శాఖామంత్రి నారా లోకేష్ దావోస్ పర్యటనపై వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోడిగుడ్డు అమర్నాద్ చేసిన విమర్శలపై గంటా నూకరాజు స్పందించారు. చంద్రబాబు అంటేనే ఐటికి అంబాసిడర్ అని, విదేశీ పెట్టుబడులకు ప్రతినిధి అని అన్నారు. అలాంటిది చంద్రబాబు, లోకేష్‌పై నోటికి వచ్చినట్లు మాట్లాడటం సరికాదని హెచ్చరించారు. మీరు ఐటీ మంత్రిగా ఉండి ఎన్ని పెట్టుబడులు తెచ్చారని, ఎన్ని ఐటి పరిశ్రమలు వచ్చాయని నిలదీశారు. విదేశాలకు వెళ్ళేటప్పుడు కూడా పార్టీ రంగుల షూట్లు వేసుకొని వెళ్లి బిక్క మొహాలతో తిరిగి వచ్చారని అన్నారు. ఒకరి కోసం మాట్లాడే ముందు మీరేమి చేశారో తెలుసుకొని మాట్లాడాలని అన్నారు. నోరుందని, నోట్లో నాలుక ఉందని నోటికి వచ్చినట్లు మాట్లాడితే తెలుగు ప్రజలు సహించరని అన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని అన్నారు. అన్ని రంగాలను విధ్వంశం చేసి రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని, రాష్ట్రంలో యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు వేస్తున్నారని అన్నారు. ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళలకు, విద్యార్థులకు అండగా ఉంటూ రాష్ట్రం సుభిక్షంగా ఉందని గంటా నూకరాజు అన్నారు.

జివిఎంసి స్థాయి సంఘంలో పలు అభివృద్ధి పనులకు ఆమోదం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జివిఎంసి పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయి సంఘం ఆమోదం తెలిపిందని స్థాయి సంఘం చైర్ పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయం స్థాయి సంఘం సమావేశ మందిరంలో స్థాయి సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థాయి సంఘం చైర్ పర్సన్ మాట్లాడుతూ స్థాయి సంఘం సమావేశంలో 110 అంశాలతో పాటు ఒక టేబుల్ అజెండా అంశము కలిపి మొత్తం 111 అంశాలు పొందుపరిచారని, వాటిని స్థాయి సంఘం సభ్యులు చర్చించిన పిదప మినిస్టీరియల్ సిబ్బందికి సంబంధించిన 44వ అంశము వాయిదా వేయడమైనదని, మిగిలిన 110 అంశాలు ఆమోదం పొందాయన్నారు. ఇంజినీరింగ్ విభాగం, ప్రజారోగ్య విభాగం అభివృద్ధి పనుల అంశాలకు సంబంధించి ఆమోదం పొందిన వాటిలో ఉన్నాయని, వాటిని చర్చించిన పిదప సభ్యులు ఆమోదం తెలిపారని చైర్ పర్సన్ తెలిపారు. ఈ సమావేశంలో 2,3,8 జోనల్ కమీషనర్లు ఎమ్.వి.డి ఫణిరామ్, కె.శివప్రసాద్, హేమావతి, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఆదినారాయణరావు, కార్యనిర్వాహక ఇంజినీర్లు శాంతిరాజ్, పి.వి.గంగాధరరావు, అప్పారావు, దిలీప్, ఎ.ఎమ్.ఒ.హెచ్.లు. డా.ఎన్.కిషోర్, సునీల్ కుమార్, బి.శివప్రసాదరావు, పరిపాలనాధికారి ఎ.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి జీ తెలుగులో ఎన్నాళ్లో వేచిన హృదయం

విశాలాంధ్ర - విశాఖపట్నం : జీ తెలుగు మరో కొత్త సీరియల్తో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆసక్తికరమైన కథ, కథనంతో రూపొందుతున్న సరికొత్త సీరియల్ ఎన్నాళ్లో వేచిన హృదయం జనవరి 27న ప్రారంభం కానుందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. బాధ్యతలు, బంధాలే ప్రధానంగా సాగే అందమైన ప్రేమకథ ఎన్నాళ్లో వేచిన హృదయం సోమవారం నుంచి శనివారం వరకు మధ్యాహ్నం 2:30 గంటలకు, మీ జీ తెలుగులో ప్రసారమవుతుందాన్నారు. ఎన్నాళ్లో వేచిన హృదయం సీరియల్ త్రిపుర (తన్వియ) అనే ఒక స్కూల్ టీచర్, వ్యాపారవేత్త అయిన బాలకృష్ణ(చందు గౌడ) మధ్య సాగే కథతో రూపొందుతోందన్నారు. కారు ప్రమాదంతో మానసిక వైకల్యానికి గురైన బాలకృష్ణ ఆరోగ్యం బాగుపడేందుకు అతణ్ని రామాపురం తీసుకొస్తారన్నారు. కుటుంబ బాధ్యతలతో సాగుతున్న త్రిపుర జీవితం బాలతో ఎలా ముడిపడుతుంది? ఇద్దరి జీవితాల్లో వచ్చే సమస్యలేంటి? అనే విషయాలు తెలుసుకోవాలంటే జీ తెలుగులో ప్రసారమయ్యే ఎన్నాళ్లో వేచిన హృదయం సీరియల్ని మిస్ కాకుండా చూసేయలన్నారు. చందు గౌడ, తన్వియ ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, ముంతాజ్, లక్ష్మణ్, ఉమ, కౌశల్, ప్రసాద్, కరాటే కళ్యాణి, విశ్వ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. అద్భుతమైన కథాంశం, ఆసక్తికరమైన మలుపులతో సాగే ఎన్నాళ్లో వేచిన హృదయం సీరియల్ మీరూ తప్పక వీక్షించాలన్నారు.

గంభీరం రిజర్వాయర్‌లో ఈతకు వచ్చి బీటెక్ విద్యార్థి మృతి

6 గురు స్నేహితులతో వచ్చి ఈత కొడుతూ మునిగిపోయిన సాయి

సంఘటన స్థలానికి చేరుకున్న ఆనందపురం పోలీసులు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం గంభీరం పంచాయతీలో ఉన్న రిజర్వాయర్లో ఈతకు దిగి కొమ్మాది గాయత్రి ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే... కందివలస గ్రామం, గుర్ల మండలం, విజయనగరం జిల్లా, చ చెందిన మీసాల నాని(20) గాయత్రి ఇంజనీరింగ్ కళాశాల లో సివిల్ ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం నాని తన 6 గురు స్నేహితులతో కలిసి శుక్రవారం సాయంత్రం గంభీరం రిజర్వాయర్ దగ్గరకు వెళ్లారు. ఈ క్రమంలో సరదాగా ఈత కొట్టేందుకు రిజర్వాయర్ లో దిగాడు. ఈ నేపథ్యంలో 20 నిమిషాల పాటు ఈత కొడుతూ అలసిపోవడంతో ఒక్కసారిగా నాని మునిగిపోవడంతో తోటి స్నేహితులును కాపాడండి అంటూ పెద్దగా కేకలు వేశారు. సంఘటన స్థలానికి, గ్రామస్తులు,ఓఎస్టీ ఫౌండేషన్ సభ్యులు కాపాడే ప్రయత్నం చేసిన అప్పటికే మునిగిపోయాడు. అయితే ఇదివరకు చాలాసార్లు మీసాలు నాని రిజర్వాయర్ కు వచ్చి సరదాగా ఈతకు వచ్చి వెళ్లే వారని తోటీ స్నేహితులు చెబుతున్నారు.ఆనందపురం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆనందపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ సిహెచ్. వాసు నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికారులపై వీఎంఆర్డీఏ ఎంసీ ఫైర్

పర్యాటక ప్రాంతాల్లో తనిఖీలు మౌలిక సదుపాయాల కల్పించాలని ఆదేశం

విశాలాంధ్ర - విశాఖ : వీఎంఆర్డీఏ పర్యాటక ప్రాంతాల్లో కనీసం సౌకర్యాలు లేకపోవడం పట్ల మెట్రోపాలిటన్ కమీషనర్ కె.ఎస్.విశ్వనాధన్ శుక్రవారం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలకు ఆలస్యంగా వచ్చిన అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ అధికారి ఇటీవలే విధుల్లో చేరారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే షోకాజ్ నోటీసు అందుకోవాలని వస్తుందని హెచ్చరించారు. సూచించిన పనులకు సకాలంలో టెండర్లు పిలవకపోవడం పట్ల ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీఎంఆర్డీఏ పార్కు, టి యు యుద్ధ విమాన మ్యూజియం, సీ హ్యారియర్ మ్యూజియంలను ఆకస్మికంగా తనిఖీ చేసి పారిశుద్ధ్యం, తాగునీరు, కనీసం మౌలిక సదుపాయాల కల్పించాలని ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలని, పాడైన విద్యుత్ దీపాలను మరమత్తు చేసి పునరుద్ధరించాలని, అదనపు టాయిలెట్ల నిర్మాణానికి అంచనాలను రూపొందించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పార్కు సందర్శనార్థం వచ్చిన స్కూల్ పిల్లలతో, అధ్యాపకులతో ముచ్చటించి పార్కులో కల్పించిన వసతుల గురించి ఆరా తీశారు. టీయు యుద్ధ విమాన మ్యూజియం ఎయిర్ కండిషనింగ్ వ్యవస్థ సమర్థంగా పని చేసేలా చూడాలని, హెలికాప్టర్ మ్యూజియం పనులను ఈ నెల 30 నాటికి పూర్తి చేసి ప్రారంభోత్సవానికి అన్ని విధాల సిద్ధేధం చేయాలని అధికారులను ఆదేశించారు. తాటిచెట్లపాలెం కళ్యాణమండపానికి సాధ్యమైనంత త్వరలో నిర్వహణ నిమిత్తం టెండర్లు పిలిచి వినియోగంలోకి తీసుకు వస్తామని పేర్కొన్నారు. ఈ పర్యటనలో కార్యనిర్వహక ఇంజనీర్లు ఎస్ వివిఎస్ఎన్ రాజు, రామరాజు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, సహాయ ఇంజనీర్లు, రెవెన్యూ విభాగం సిబ్బంది, డిఎఫ్ఓ శివానీ తదితరులు పాల్గొన్నారు.

పికిల్‌బాల్ 'హైదరాబాద్ సూపర్ స్టార్స్' సహ యజమానులుగా సినీ నటులు రకుల్ ప్రీత్ సింగ్, జాకీ భగ్నాని

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ప్రముఖ సినీ నటి రకుల్ ప్రీత్ సింగ్, నటుడు జాకీ భగ్నాని కేఎల్ఓ స్పోర్ట్స్‌తో చేతులు కలిపారు. హైదరాబాద్ సూపర్‌స్టార్స్ జట్టులో సహ యజమానులుగా చేరారు. ఈ జట్టు ముంబైలో కానున్న ప్రపంచ పికిల్‌బాల్ లీగ్‌లో పాల్గొననుంది.

ఈ సందర్భంగా సినీ నటి రకుల్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ పికిల్‌బాల్ ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న క్రీడగా ప్రాచుర్యం పొందిందన్నారు.

ఇది అన్ని వయస్సుల వారిచే ఆడబడుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్ సూపర్‌స్టార్స్ జట్టు ఈ క్రీడను మరింత ప్రోత్సహించి హైదరాబాద్‌తో పాటు దేశవ్యాప్తంగా ఆటగాళ్లను ప్రేరేపిస్తుందని తెలిపారు. ప్రపంచ పికిల్‌బాల్ లీగ్‌లో చేరడం నా క్రీడా ప్రస్థానంలో ఒక కొత్త అధ్యాయం అన్నారు. ఇది నాకు ఎంతో సంతోషాన్ని ఇస్తుందన్నారు.